సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 5 । మార్చి । 2023



ధాత్రి ప్లాట్లకు వేలం

ధాత్రి టౌన్‌షిప్‌లో రెండో విడత ప్లాట్ల వేలం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు.

- 8లో ▸



త్వరలో పప్పుదినుసుల యూనిట్

జిల్లా మహిళ సహకార సమాఖ్య ఆధ్వర్యంలో త్వరలో పప్పు దినుసుల యూనిట్ ప్రారంభించనున్నట్లు డీఆర్‌డీవో పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.8 /21.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మార్కెట్‌కు మూడు రోజుల పాటు సెలవులు

ఇందూరు: హోలీ సందర్భంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8 వరకు మార్కెట్‌లో ఎలాంటి వ్యా పార లావాదేవీలు ఉండవని, కావున రైతు లు ఈ విషయాన్ని గమనించి పంటలను మార్కెట్‌కు తేవద్దని కోరారు. 9వ తేదీ నుంచి యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని వివరించారు.

రూ. 2 కోట్ల వ్యాపారం



నవీపేట: మండల కేంద్రంలో శనివారం మేకల సంత కిక్కిరిసింది. ఈనెల 6, 7వ తేదీల్లో హోలీ పండుగ నేపథ్యంలో క్రయవిక్రయాలు భారీగా జరిగాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు శుక్రవారం రాత్రే వాహనాల్లో మేకలను తీసుకుని సంతకు వచ్చారు. భారీగా వాహనాలు రావడంతో బాసర రహదారిపై ఉదయం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సంతలో రూ. 2కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

ఏజీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా జడ్జి



ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులోని మూడో అంతస్తుల్లో ఏర్పాటు చేసిన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కార్యాలయాన్ని జిల్లా జడ్జి సునీత కుంచాల శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌రావు, సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీకాంత్ బాబు, పద్మావతి, ఆర్డీవో రవి కుమార్, సీనియర్ న్యాయవాదులు రమేశ్, రాజారెడ్డి, కిరణ్ కుమార్ గౌడ్, మధుసూధన్‌రావు, గవర్నమెంట్ ప్లీడర్ శ్రీహరి ఆచార్య పాల్గొన్నారు.



ఫత్తేపూర్ శివారులోని ఫామ్‌హౌజ్



ఆర్మూర్ పట్టణ శివారులో..

ప్రకృతి ఒడిలో ఫామ్‌హౌజ్



లైటింగ్ వెలుగుల్లో ఓ ఫామ్‌హౌజ్



ఫామ్‌హౌజ్‌లోని మొక్కలు, లైటింగ్

సండే స్పెషల్

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరాలు, పట్టణాల్లో నిత్యం ఉరుకులు పరుగుల జీవితాన్ని గడుపుతున్న పట్టణవాసులు పల్లె వాతావరణాన్ని కోరుకుంటున్నారు. వీకెండ్స్, సెలవుదినాల్లో కుటుంబ సమేతంగా గ్రామాల్లో సరదాగా గడిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందుకోసం పట్టణాల సమీపంలోని, గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో సకల సౌకర్యాలతో విలాసవంతమైన ఫామ్‌హౌజ్‌లను నిర్మించుకుంటున్నారు. పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దుకొని కుటుంబ సమేతంగా ఇక్కడకు వచ్చి సేద తీరుతున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న కల్చర్
- వ్యవసాయ క్షేత్రాల్లో నిర్మాణాలు
- గ్రామీణ వాతావరణంపై పట్టణవాసుల ఆసక్తి
- వీకెండ్స్ విడిదిగా వినియోగం
- కుటుంబ సభ్యులతో సేదదీరుతూ..

ఆర్మూర్: ఫామ్‌హౌజ్ కల్చర్.. ఒకప్పుడు ధనికులకు మాత్రమే పరిమితం కాగా.. ఇప్పుడు కాస్తో కూస్తో ఆర్థికంగా స్థిరపడ్డ ప్రతిఒక్కరూ ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణాల్లో పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం, కోవిడ్ మహమ్మారి లాంటి వైరస్‌ల బారిన పడకుండా ఉండాలనే ఆలోచనతో మధ్య తరగతి కుటుంబీకులు, వ్యాపారస్తులు సైతం వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్‌హౌజ్‌ల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నారు. సెలవు దినాల్లో, పండుగ రోజుల్లో ఈ ఫామ్‌హౌజ్‌లలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నారు. జిల్లాలో వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్‌హౌజ్‌ల నిర్మాణాలు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనం. వ్యవసాయ క్షేత్రాల్లో కొంత స్థలాన్ని ఫామ్‌హౌజ్ నిర్మాణానికి కేటాయిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి నేర్పిన గుణపాఠంతో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిన వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో ఫామ్‌హౌజ్‌ల నిర్మాణాలు చేపడుతున్నారు. పూల మొక్కలు, టేకు చెట్లు, తదితర క్రోటన్ మొక్కల పెంపకాలతో ఫామ్‌హౌజ్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఉదయం, సాయంత్రాల్లో ఫామ్‌హౌజ్ సమీపంలో యోగా, వాకింగ్‌లు చేస్తూ తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకొనే పనిలో పడ్డారు. ఫంక్షన్ హాళ్లకు, హోటళ్లలో డబ్బులు కుమ్మరించి విందులు చేసుకోవాల్సిన అవసరం లేకుండా ఇంట్లో చేసుకొనే చిన్నపాటి ఫంక్షన్‌లు, విందులను ఫామ్‌హౌజ్‌లో చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఫామ్ ల్యాండ్స్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం

ఇంటి స్థలాల కొనుగోలు, అమ్మకాలపై వ్యాపా రం నిర్వహించే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ మధ్య ఫామ్ ల్యాండ్స్ పేరిట వ్యాపారం చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో ఎకరాలకు ఎకరా ల భూమిని కొనుగోలు చేసి ఫామ్‌ల్యాండ్స్ పే రిట అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల ఒక వ్యాపారి వారం రోజుల్లోనే 50కి పైగా ఫామ్‌హౌజ్‌ల నిర్మాణానికి స్థలాలను అమ్మినట్లు స మాచారం. ప్రకృతి ఒడిలో తమకు స్థలం ఉంటే ఫామ్‌హౌజ్ నిర్మించుకోవాలనే ఆలోచన ఉన్న మధ్య తరగతి కుటుంబీకులు సైతం ఈ స్థలాలను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

చక్కని అనుభూతి



ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ రోడ్డులో కొనుగోలు చేసిన స్థలంలో ఫామ్‌హౌజ్ నిర్మించుకున్నాం. సెలవు దినాల్లో, పండుగ రోజుల్లో పిల్లలతో కలిసి ఇక్కడికి వచ్చి సేద తీరుతాం. ఇక్కడ కొబ్బరి, మామిడి చెట్లను పెంచాం. మా కుటుంబ సభ్యులమంతా ఇక్కడ పని చేస్తూ కూరగాయలు సైతం పండిస్తాం. వ్యాపారాలతో రోజూ సతమతమవుతూ ఇబ్బంది పడే మేం ప్రకృతి ఒడిలో సేద తీరడం వెలకట్టలేని అనుభూతి.

– దాసు దంపతులు, ఆర్మూర్

కోవిడ్‌తో ప్రకృతి విలువ తెలిసింది



వ్యాపారాల్లో నిత్యం బిజీగా ఉండే మాకు కోవిడ్ సమయంలో ప్రకృతి విలువ తెలిసింది. మా పిల్లలిద్దరూ విదేశాల్లో స్థిరపడ్డారు. కోవిడ్ సమయంలో ప్రకృతి ఒడిలో మనిషి జీవించడంపై ఆసక్తి పెరిగింది. అంకాపూర్ శివారులోని మా వ్యవసాయ భూమిలో మా అమ్మా, నాన్నల పేరిట ఫామ్‌హౌజ్‌ను నిర్మించాం. చుట్టూ చెట్లు పెంచుతున్నాం. సెలవు దినాల్లో ఇక్కడ మిత్రులు, బంధువులతో కలిసి ఆనందంగా గడుపుతున్నాం.

– పద్మ మురళి, రాజశ్రీ దంపతులు, ఆర్మూర్

టెన్షన్లు మర్చిపోతాం



వ్యాపార, రాజకీయ జీవితంలో రోజు వారి టెన్షన్స్ అన్నింటినీ ఫామ్‌హౌజ్‌కు వస్తే మర్చిపోతాం. సెలవు దినాల్లో కుటుంబ సభ్యులతో ఇక్కడికి వచ్చి ప్రకృతి ఒడిలో సేద తీరడం చాలా ఆనందాన్ని ఇస్తోంది. వ్యవసాయంతో పాటు గార్డెనింగ్ చేయడం వ్యాయామంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తోంది.

– అయ్యప్ప శ్రీనివాస్, ఆర్మూర్

డీజిల్ కూపన్ల దుర్వినియోగం

- ప్రభుత్వ వాహనం మూలకు పడేసిన వైనం
- అద్దెకు పెట్టిన ఉద్యోగి వాహనం నడుపుతున్న ప్రభుత్వ డ్రైవర్



డీజిల్ కూపన్లు వాడుతున్న అద్దె వాహనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వాహనాల వాడకం విషయంలో తవ్విన కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. అంతా మా ఇష్టం అన్నట్లు విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారు. తాజాగా మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఓనర్ కం డ్రైవర్ పథకానికి తూట్లు పొడిచి ఉద్యోగుల వాహనాలనే అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టిన అధికారులు డీజిల్ కూపన్ల విషయంలోనూ దుర్వినియోగానికి పాల్పడడం గమనార్హం. ప్రభుత్వం కొనుగోలు చేసి పంపిన వాహనాలకు ఉపయోగించాల్సిన డీజిల్ కూపన్లను అద్దె ప్రాతిపదికన పెట్టుకున్న వాహనాల కోసం వాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జూనియర్ అసిస్టెంట్ వినోద్‌కు చెందిన వాహనాన్ని అద్దెకు పెట్టుకోవడంతో పాటు ఏకంగా సదరు వాహనానికి డీజిల్ కూపన్లు వాడుకుంటున్నారు. పైగా ఈ వాహనాన్ని ప్రభుత్వ డ్రైవర్ సాయిలు నడుపుతుండడం విశేషం. ఈవాహనాన్ని డీఎంహెచ్‌వో సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. హైదరాబాద్‌లో తన కుటుంబం వద్దకు వెళ్లి రావడానికి సైతం ఈ కారునే ఉపయోగిస్తున్నారు. ఏవో గంగాధర్ ఆధ్వర్యంలో ఉండాల్సిన కూపన్లు జూనియర్ అసిస్టెంట్ వినోద్ వద్ద ఉంచడంతో ఇష్టం వచ్చినట్లు వాడుతున్నాడు.

ఇదిలా ఉండగా ప్రభుత్వం నుంచి వచ్చిన సుమో వాహనాన్ని మెడికల్ కళాశాలలో మూలనపడేశారు. ఈ వాహనానికి ఉపయోగించాల్సిన డీజిల్ కూపన్లు అద్దెపై పెట్టిన జూనియర్ అసిస్టెంట్ వినోద్ వాహనానికి వాడుతున్నారు. ఇక్కడ గమనించాల్సిన మరో విషయమేమిటంటే వినోద్ వాహనానికి మాత్రం ప్రతి నెల కచ్చితంగా రూ.33వేలు బిల్లులు డ్రా చేస్తుండడం గమనార్హం. మరోవైపు మూలన ఉన్న ప్రభుత్వ సుమో వాహనానికి సంబంధించి తరచుగా టైర్లు, స్పేర్ పార్టులు, ఇతర మరమ్మతుల బిల్లులు సైతం డ్రా చేస్తుండడం కొసమెరుపు.

వెంటాడిన విధి

- మనస్తాపంతో అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి వివాహిత బలవన్మరణం
- రెండు నెలల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు



శ్రీనివాస్, అనూషలతో చిన్నారులు (ఫైల్)

నిజామాబాద్ సిటీ/ముస్తాబాద్(సిరిసిల్ల) : అభం.. శుభం తెలియని వయసులోనే ఆ చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయారు. రక్తం పంచుకు పుట్టిన కొడుకు రెండు నెలల క్రితమే దూరం కాగా.. ఇప్పుడు పెద్ద దిక్కు అవుతుందనుకున్న కోడలు లేకపోవడంతో పండుటాకులు కన్నీరుమున్నీరవుతున్నారు. జిల్లా కేంద్రంలో శనివారం సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన జటాల అనూష (27) ఏడాది వయసున్న తన కూతురు కృతికతో కలిసి అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కృతికకు తీవ్ర గాయాలు కాగా స్థానిక యువకులు ఇద్దరు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనూష ఆత్మహత్య ముస్తాబాద్‌లోని వారి బంధువులను విషాదంలో ముంచింది. ముస్తాబాద్‌కు చెందిన జటాల ప్రేమానందం, కల్పన దంపతులు వ్యాపార రీత్యా కరీంనగర్‌లో స్థిరపడ్డారు. వీరి పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెండు నెలల క్రితమే గుండెపోటుతో మృతి చెందాడు. భర్త మరణానంతరం జనవరిలో నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డు సాయి ఆర్‌కేఆర్ అపార్ట్‌మెంట్‌లో ఉండే పెద్దమ్మ ఇంటికి అనూష వచ్చి చిన్న కూతురితో ఇక్కడే ఉంటోంది. ఈ క్రమంలోనే ఆమె అఘాయిత్యానికి పాల్పడడం బంధువుల్లో తీరని విషాదం నింపింది. అనూష తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారు. అనూష మామ ప్రేమానందం కూడా అనారోగ్యంతో మంచంపట్టాడు. ఆయన చిన్నకుమారుడు కెనడాలో ఉంటున్నాడు. ఆస్పత్రిలో చిన్నారి కృతిక చికిత్స పొందుతోంది.

పరిశ్రమల అభివృద్ధికి ఐటీ హబ్ ఆరంభం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే బిగాల



ఐటీ హబ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలో పరిశ్రమల అభివృద్ధికి ఐటీ హబ్ ఆరంభం లాంటిదని, త్వరలో ఎన్నో పరిశ్రమలు రానున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. శనివారం నగరంలోని ఐటీ హబ్ భవన పనులను ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి పరిశీలించారు. అనంతరం ఐటీ హబ్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను బీఆర్‌ఎస్ ఎన్నారై గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్‌గుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా చేపట్టిన ఐటీ హబ్ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. అతి త్వరలో కేటీఆర్ గారి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. రూ. 50కోట్ల వ్యయంతో చేపట్టిన ఐటీ హబ్‌లో 750 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. దేశ వ్యాప్తంగా ఐటీ ఎక్స్‌పోర్టులో రెండో స్థానంలో ఉన్నామన్నారు. జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ రాష్ట్రానికి పట్టిన దరిద్రం

- బీఆర్‌ఎస్‌లో తెలంగాణ ద్రోహులే మిగిలారు
- రాష్ట్ర బడ్జెట్ అతిపెద్ద స్కాం
- బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



పాల్గొన్న మహిళలు

సుభాష్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రానికి పట్టిన దరిద్రమని, అదే సమయంలో నరేంద్ర మోదీ ప్రధాని కావడం మన అదృష్టమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పేదవాడి గూడు కోసం బీజేపీ అర్బన్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో చోటుచేసుకున్న అనేక తప్పిదాలు, లోటుపాట్ల వల్ల రాష్ట్రం అప్పులపాలైందన్నారు. అన్ని పార్టీలను కాదని కేసీఆర్‌ను సీఎం చేసుకున్నామని, ఆ సమయంలో ఆయన చెప్పిన వాగ్దానాలు, హామీలన్నీ నీటిమూలయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నీ స్కాములేనని.. భూములను కంప్యూటర్‌లోకి ఎక్కించి ధరణి పేరుతో రైతులను చంపుతున్నారని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర బడ్జెట్ పెద్ద అవినీతి అని, ప్రతియేటా రూ. లక్ష కోట్లు అదనంగా చూపుతూ అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. 'డబుల్' ఇళ్లు పెద్ద అబద్ధమని, కాళేశ్వరం పెద్ద స్కాం అని ఆరోపించారు. నిధులన్నీ కాళేశ్వరం ప్రాజెక్టులో కుమ్మరించి, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశార ని విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో తెలంగాణ ద్రో హులే మిగిలారని, కేవలం కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. అలాంటి బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టాలని, అది బీజేపీతోనే సాధ్యమన్నారు.

'అర్బన్ ఎమ్మెల్యే అసమర్థుడు'

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా చేతగాని దద్దమ్మ అని, కబ్జాలలో ఇందూరు నంబర్‌వన్‌గా నిలుస్తోందని బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. అర్బన్‌లో ఇళ్ల కోసం 45వేల దరఖాస్తులు వస్తే.. ఒక్క ఇల్లు అయినా పంపిణీ చేయలేని అసమర్థ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా అని విమర్శించారు. 54 వేల ప్లాట్లు అయ్యే భూమిని ఎమ్మెల్యే, మేయర్‌తోపాటు వారి అనుచరులు కబ్జా చేశారని, రూ. 3లక్షల పథకాన్ని కూడా దోచుకునేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. ఎమ్మెల్యే తమ్ముడిపై కబ్జాలు, నకిలీపత్రాల విషయంలో ఎఫ్‌ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. మార్చి 31లోగా ఇళ్ల పంపిణీ చేయాలని ఎమ్మెల్యేకు డెడ్‌లైన్ పెడుతున్నామని, లేకుంటే ఏప్రిల్ 1న తామే పేదలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా పేదల నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, పంచరెడ్డి లింగం, స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీని రక్షించాలి



ఖలీల్‌వాడి: ఆర్టీసీని రక్షించాల్సిన బాధ్యత ప్రయాణీకులకు ఉంటుందని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు అధికారి వెంటకరమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌ కార్యాలయంలోని సమావేశ హాల్‌ జరిగిన ప్రయాణీకుల సదస్సులో ఆయన మాట్లాడారు.ఆర్టీసీలో ప్రయాణించడం సురక్షితమన్నారు.ప్రైవేట్‌ వాహనాల్లో ఇటీవల ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు చూస్తున్నామని తెలిపారు. ప్రయాణీకులు ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి దృష్టికి నాన్‌స్టాప్‌ బస్సులు,కార్గో తోపాటు, సిటీ బస్సులకు సంబంధించిన సమస్యలను తీసుకువచ్చారు.సమస్యలను పరిష్కారిస్తామని ఆమె హామీ ఇచ్చారు.జిల్లా వినియోగదారులఫోరం అధ్యక్షుడు రాజేందర్‌, డిప్యూటీ ఆర్‌ఎం శంకర్‌, డిపో మేనేజర్లు ఆనంద్‌,వెంకటేశం,సిబ్బంది పాల్గొన్నారు.

సెమిస్టర్‌ పరీక్షలకు 91 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శనివారం జరిగిన బీఈడీ, పీజీ సెమిస్టర్స్‌ పరీక్షలకు 91 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ ఎం.అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మూడో సెమిస్టర్‌ పరీక్షల్లో 462 మంది విద్యార్థులకు 438 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ మొదటి సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో 562 మంది విద్యార్థులకు 531 మంది పరీక్ష రాశారు. ఉదయం జరిగిన బీఈడీ మూడో సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో 1296 మంది విద్యార్థులకు 1260 మంది హాజరు కాగా 36 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ తెలిపారు.

‘మానవ విలువలు’ పరీక్షకు 511 మంది..

నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లాలోని ఇంటర్‌ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం నైతికత మానవ విలువలు పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 116 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 511 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్‌ ప్రకటనలో తెలిపారు.

పోలీస్‌ అధికారులకు శిక్షణ



ఖలీల్‌వాడి: క్రిమినల్‌ కేసులో పోలీసులు పంచానామా, సాక్ష్యాలు తీసుకోవడంపై రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ వై జయంతి శిక్షణ ఇచ్చారు. నిజామాబాద్‌ జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో పోలీస్‌ అధికారులకు క్రిమినల్‌ కేసులపై శిక్షణ శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు రహీంయుద్దీన్‌, భూసారపు రాజేష్‌ పలు అంశాలను వివరించారు. లక్ష్మీనర్సయ్య, పెండ్యాల పద్మావతి, రవిరాజ్‌ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్‌ క్రీడలు

ఖలీల్‌వాడి: వార్షిక స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ మీట్‌ శనివారం పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌ గ్రౌండ్‌లో నాలుగో రోజు కొనసాగిందని సీపీ నాగరాజు తెలిపారు. టెబుల్‌ టెన్నీస్‌, బ్యాడ్మింటన్‌ సెమీ ఫైనల్‌ మ్యాచ్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

‘ధాత్రి’లో ప్లాట్ల విక్రయానికి వేలం

- మార్చి 16, 17, 18 తేదీల్లో నిర్వహణ
- ప్రారంభ ధర చదరపు గజానికి రూ. 6వేలు
- ప్రీ–బిడ్‌ సమావేశంలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: నగరానికి ఆనుకుని మల్లారం వద్ద ప్రభుత్వ పరంగా నెలకొల్పిన ధాత్రి టౌన్‌షిప్‌లో రెండో విడతగా ప్లాట్ల విక్రయాల కోసం ఈనెల 16, 17, 18 తేదీల్లో కొత్త కలెక్టరేట్‌లో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నామని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఈ టౌన్‌షిప్‌లో ఇప్పటికే రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని, డ్రెయినేజీలు, నీటి వసతి, విద్యుద్ధీకరణ వంటి మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులోకి తెస్తామన్నారు. శనివారం కొత్త కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్‌ ఆధ్వర్యంలో ప్రీ బిడ్డింగ్‌ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు, రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు, బిల్డర్లు, ఔత్సాహికులకు ధాత్రి టౌన్‌షిప్‌ ప్రత్యేకతలపై కలెక్టర్‌ హనుమంతు వివరిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు.

డీటీసీపీ అప్రూవుడ్‌ లేఅవుట్‌

టౌన్‌షిప్‌లో తొలి విడతలో 80 ప్లాట్ల అమ్మకాల కోసం నవంబర్‌లో బహిరంగ వేలం నిర్వహించామని కలెక్టర్‌ తెలిపారు. ప్రస్తుతం రెండో విడతలో 150 ప్లాట్లకు వేలం జరుగుతుందన్నారు. మొదటిరోజు 16న 50 ప్లాట్లు, 17న మరో 50 ప్లాట్లు, 18న మిగతా 50 ప్లాట్లకు వేలం పాట ఉంటుందన్నారు. చదరపు గజం ప్రారంభ ధర ఇదివరకు రూ. 8వేలు ఉండగా, ప్రభుత్వ అనుమతితో దానిని రూ. 6వేలకు తగ్గించామన్నారు.

ఒకే ఈఎండీతో..

బహిరంగ వేలంలో పాల్గొనాలనుకునేవారు ఈఎండీ రూ. 10వేలు చెల్లించాలన్నారు. ఒకే ఈఎండీతో అన్ని ప్లాట్ల వేలంలోనూ పాల్గొనేందుకు అవకాశం (ఏదైనా ప్లాటు దక్కించుకునేంత వరకు) కల్పిస్తున్నామని కలెక్టర్‌ తెలిపారు. వేలంలో ప్లాట్‌ రాని వారికి రూ. 10వేల ఈఎండీ వాపస్‌ చేస్తామన్నారు. రాజీవ్‌ స్వగృహ పథకంలో ఇది వరకే దరఖాస్తు చేసుకుని రూ. 3వేల రుసుము చెల్లించిన వారు ఒరిజినల్‌ ఈ–సేవ రశీదు సమర్పించి వేలంలో పాల్గొనే వెసులుబాటు ఉందన్నారు. ప్లాట్‌ దక్కించుకున్న వారు 90రోజుల వ్యవధిలో మూడు వాయిదాల్లో మొత్తం రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒకే విడతలో మొత్తం రుసుము చెల్లించేందుకు ముందుకు వచ్చే వారికి ప్లాట్‌ ధరలో రెండు శాతం రిబెట్‌ వర్తిస్తుందని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్‌, టీఎస్‌ఐఐసీ జిల్లా మేనేజర్‌ దినేష్‌ పాల్గొన్నారు.

మెట్లబావికి మరమ్మతులు ప్రారంభం



బావిలో బయటపడ్డ మహావిష్ణు విగ్రహం



బావిలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

లింగంపేట: లింగంపేట సమీపంలోని జక్సాని నాగన్నగారి మెట్ల బావిలో పూడిక తీత పనులు శనివారం ప్రారంభించారు. కలెక్టర్‌ ప్రత్యేక నిధులతో మెట్లబావి పునరుద్ధరణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్‌ బొల్లు లావణ్య తెలిపారు. బావి అభివృద్ధి కోసం ఇన్ఫోసిస్‌ సంస్థ ముందుకు వచ్చినట్లు చెప్పారు. పురావస్తు శాఖ అధికారి కల్పనారమేశ్‌ పలుమార్లు బావిని సందర్శించి సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో బావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. శనివారం క్రేన్‌ సహాయంతో పూడిక తీత పనులు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా బావిలో మహావిష్ణు విగ్రహం బయట పడింది. యువ యూత్‌ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్‌, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని వినతి



సుభాష్‌నగర్‌: డీఎంహెచ్‌ఓతోపాటు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏవో, సూపరింటెండెంట్‌, వాహనాల ఇన్‌ఛార్జిలు అవినీతికి పాల్పడుతున్నారని, వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు సయ్యద్‌ కైసర్‌ డిమాండ్‌చేశారు. ఈమేరకు శనివారం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. కైసర్‌ మాట్లాడుతూ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది తమ కుటుంబసభ్యుల పేర్లతో ఒక్కొక్కరు 2 నుంచి 3 వాహనాలను నడిపిస్తున్నారని తెలిపారు. వాహనాలు తిరగకున్నా.. తిరిగినట్లు చూపిస్తూ ప్రతినెలా రూ.లక్షల్లో బిల్లులు పొందుతున్నారని ఆరోపించారు. నాయకులు సర్దార్‌ నరేందర్‌ సింగ్‌, బాధితుడు సమీర్‌ ఉన్నారు.

ఎస్సెస్సీ, ఇంటర్‌ పరీక్షలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌

సుభాష్‌నగర్‌: పదోతరగతి, ఇంటర్మీడియెట్‌ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్‌ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌ పరీక్షలు ఈనెల 15 నుంచి ఏప్రిల్‌ 04 వరకు, ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఇంటర్మీడియెట్‌ పరీక్షలకు మొత్తం 35,017 మంది హాజరు కానున్నారని, వీరిలో 4,354 మంది ఒకేషనల్‌ కోర్సులకు సంబంధించిన విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇంటర్‌ పరీక్షల కోసం జిల్లాలో 54 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అలాగే పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్‌ 3 నుంచి 12 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. 10న జరిగే ఎస్సెస్సీ సామాన్య శాస్త్రం(పార్ట్‌–1 ఫిజికల్‌ సైన్స్‌, పార్ట్‌–2 బయోలాజికల్‌ సైన్స్‌) పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 21,707 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, వీరిలో 21,590 మంది రెగ్యులర్‌, 117 మంది ప్రైవేటు అభ్యర్థులు ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 138 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

లోటుపాట్లకు తావివ్వొద్దు

పరీక్ష ప్రారంభమయ్యే నిర్ణీత సమయానికి కంటే ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి లోటుపాట్లకు తావివ్వొద్దని అదనపు కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఐఈవో రఘురాజ్‌, డీఈవో దుర్గాప్రసాద్‌, ఏసీ విజయభాస్కర్‌, డీఎంహెచ్‌వో డాక్టర్‌ సుదర్శనం, డీపీవో జయసుధ, ఎంహెచ్‌వో సాజిద్‌, పవన్‌, అధికారులు పాల్గొన్నారు.

సరోజనమ్మకు అరుదైన గౌరవం



సరోజనమ్మ

బోధన్‌: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయురాలు, రాష్ట్ర ఆల్‌ పెన్షనర్స్‌ అండ్‌ రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ డివిజన్‌ గౌరవ అధ్యక్షురాలు గుర్రాల సరోజనికి (సరోజనమ్మ) అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఈ నెల 6న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సన్మానానికి సరోజనమ్మను ఎంపిక చేశారు. ఈ మేరకు రాజ్‌భవన్‌ నుంచి ఆమెకు ఆహ్వానం అందింది. సరోజనమ్మ సామాజిక సేవా కార్యక్రమాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు, సన్మానం పొందే అవకాశం దక్కడంపై విశ్రాంత ఉద్యోగ సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళా దినోత్సవ కానుకగా ‘ఆరోగ్య మహిళ’

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- సీఎస్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్ష

సుభాష్‌నగర్‌: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం వినూత్నంగా ‘ఆరోగ్య మహిళ’ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుడుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ప్రయోగాత్మకంగా తొలుత వంద కేంద్రాల్లో ఈనెల 8న ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. శనివారం పంచాయతీరాజ్‌ శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, పోలీస్‌ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. ఆరోగ్య మహిళా పథకం విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ప్రత్యేకంగా మహిళలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. అలాగే ఆకస్మిక గుండెపోటు మరణాలను నివారించాలని లక్ష్యంతో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ చేపట్టిన సీపీఆర్‌ శిక్షణలో అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని మంత్రి సూచించారు. ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులకు సీపీఆర్‌ శిక్షణ అందేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. కాగా ఆకస్మిక గుండెపోటుకు గురైన వారికి స్వల్ప మోతాదులో ఎలక్ట్రిక్‌ షాక్‌ ఇవ్వడం ద్వారా వారి ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడే ఏఈడీ పరికరాలను జిల్లాకు రెండు చొప్పున పంపిస్తున్నామని మంత్రి వెల్లడించారు. అనంతరం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి డబుల్‌ బెడ్‌రూం పథకంతో పాటు పోడు భూములకు పట్టాల పంపిణీ, ఆయిల్‌పామ్‌ సాగు తదితర అంశాలపై సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ నాగరాజు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్‌, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్‌ మీనా పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ నాగరాజు, అదనపు కలెక్టర్లు

చదవడం, రాయడం నేర్వాలి

- విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు
- పలు పాఠశాలల సందర్శన

లింగంపేట: ప్రతీ విద్యార్థి ఐదో తరగతి వరకు కనీస అభ్యాసన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర అకాడమిక్‌ మానిటరింగ్‌ అధికారి శ్రీనాథ్‌ అన్నారు. శనివారం లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం నేర్పాలన్నారు. పదో తరగతికి వచ్చినా చదవడం, రాయడం రాకపోతే మనం పడ్డ శ్రమ వృథా అవుతున్నట్లే అన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడికి యాక్షన్‌ ప్లాన్‌ ఉండాలన్నారు. రాష్ట్ర రిసోర్స్‌ పర్సన్‌ సంజీవులు మాట్లాడుతూ.. పిల్లల్లో గుణాత్మక మార్పు రావాలన్నారు. అనంతరం మండల విద్యాధికారి రామస్వామి మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి రిపోర్టులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా సెక్టోరల్‌ అధికారి వేణు, మండల నోడల్‌ అధికారి సాయన్న, కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయుడు వహీద్‌ సిద్ధిఖీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భయాందోళనలు తొలగించాలి

లింగంపేట: పదో తరగతి విద్యార్థుల్లో భయాందోళన తొలగించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర పరిశీలకుడు శ్రీనాథ్‌ సూచించారు. శనివారం ఆయన మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రూపులుగా విభజించి దత్తత తీసుకొని బోధన చేయాలన్నారు. ప్రతీ రోజు వేకువజామున విద్యార్థులకు ఫోన్‌ చేసి నిద్ర లేపాలన్నారు.

ఇష్టపడి చదవాలి

ఎల్లారెడ్డి: విద్యార్థులు ఇష్టపడి చదవాలని, కష్టపడి కాదని రాష్ట్ర విద్యాశాఖ టీమ్‌ అబ్జర్వర్‌ సంజీవరావు అన్నారు. పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. శ్రీనాథ్‌, వేణుగోపాల్‌, ఎంఈవోలు వెంకటేశం, రామస్వామి ఉన్నారు.

దేవునిపల్లి ఉన్నత పాఠశాల సందర్శన

కామారెడ్డి రూరల్‌: కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలను శనివారం రాష్ట్ర పరిశీలకులు శ్రీనాథ్‌, వేణుశర్మ సందర్శించారు. ప్రత్యేక తరగతులను చక్కాగా నిర్వహిస్తున్న హెచ్‌ఎం గంగకిషన్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు కరుణ, శ్రీశైలం, సాయిలు, సహేందర్‌ ఉన్నారు.

త్వరలో పప్పు దినుసుల యూనిట్‌



జిల్లా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో చందర్‌నాయక్‌

- జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు
- డీఆర్‌డీవో చందర్‌నాయక్‌

డిచ్‌పల్లి: ఇందూరు జిల్లా మహిళా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో త్వరలోనే జిల్లాలో పప్పు దినుసుల యూనిట్‌ ప్రారంభించాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి(డీఆర్‌డీవో) చందర్‌నాయక్‌ తెలిపారు. శనివారం డిచ్‌పల్లిలోని ట్రైజం ట్రైనింగ్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ (టీటీడీసీ)లో జిల్లా అధ్యక్షురాలు విప్లవకుమారి అధ్యక్షతన జరిగిన జిల్లా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పప్పు దినుసుల తయారీ యూనిట్‌కు స్థలాన్ని ఎంపిక చేసి ఉత్పత్తిని ప్రారంభించాలని తద్వారా ఆదాయం పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించిన వరికోత యంత్రాలు, గడ్డి చుట్టే యంత్రం, ట్రాక్టర్‌ తదితర పనిముట్లు కొనుగోలు చేసి వాటిని అద్దెకు ఇచ్చి ఆదాయం పొందాలన్నారు. జిల్లాలో ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆదాయం వచ్చే ఇతర వ్యాపారాలు జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టాలని సూచించారు. బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి కమ్మర్‌పల్లి మండలంలో 100 శాతం పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మిగిలిన మండలాల్లో బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీడీ మధుసూదన్‌, డీపీఎంలు శ్రీనివాస్‌, మారుతి, నీలిమ, ఏపీఎం సరోజన, జిల్లా సమాఖ్య కోశాధికారి వనిత, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగాల పేరిట టోకరా




మాట్లాడుతున్న బాధితులు



నిందితుడు నరేష్‌

ఖలీల్‌వాడి: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగులకు ఓ వ్యక్తి కుచ్చు టోపి పెట్టాడు. ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు దోచుకున్నాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాలు.. నవీపేట మండలం ఫకీరాబాద్‌కు చెందిన నరేష్‌ నగరంలో రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పాడు. ఒక్కొక్కరి నుంచి డబ్బులు తీసుకొని వారికి సౌత్‌ సెంట్రల్‌ రైల్వే పేరిట డూప్లికేట్‌ ఐడీ కార్డులు ఇచ్చి మోసాలకు పాల్పడ్డాడు. ఉద్యోగాలు రాకపోవడంతో నిరుద్యోగులు నరేష్‌ను నిలదీయడంతో పరార్‌ అయ్యాడు. అయితే శుక్రవారం రైల్వే స్టేషన్‌ ప్రాంతంలో బాధితులు నరేష్‌ను గుర్తించి పట్టుకొని, వన్‌ టౌన్‌ పోలీస్‌ స్టేషన్లో అప్పచెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో చాలామంది అమాయక ప్రజలకు ఉద్యోగాల పేరుతో నరేష్‌ మోసం చేసినట్లు బాధితులు చెప్పారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు తాము ఉద్యోగాలు వస్తాయాని కట్టమని, తీరా చూస్తే అది అబద్ధమని తేలడంతో తమ డబ్బులు కావాలని అడిగితే తప్పించుకు తిరుగుతున్నాడని తెలిపారు. కొంత మందిని ఉద్యోగాల పేరుతో మూడు నెలల పాటు వివిధ ప్రాంతాల్లో పనిచేయించాడని, కనీసం జీతాలు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు తాము 25 మంది వరకు బాధితులు ఉంటామని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు



ధర్పల్లి: ధర్పల్లిలోని పెద్దమ్మ ఆలయం సమీపంలోని మూల మలుపు వద్ద శనివారం సాయంత్రం కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌గల్‌ గ్రామానికి చెందిన గాడి అమర్‌జీత్‌ ఉద్యోగ నిమిత్తం హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్‌ నుంచి భీమ్‌గల్‌ బయలుదేరారు. ధర్పల్లి పెద్దమ్మఆలయం సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. అమర్‌జీత్‌, ఆయన భార్య, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలు చోటుచేసుకున్నాయి. స్థానికులు క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

ఎస్సై వేధిస్తున్నాడని ఆత్మహత్యాయత్నం


- సోషల్‌ మీడియాలో సెల్ఫీ వీడియో వైరల్‌
- డబ్బు తీసుకొని ఇవ్వడం లేదని ఆవేదన
- కాపాడి ఆస్పత్రికి తరలించిన పోలీసులు



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న క్రాంతి

ఖలీల్‌వాడి: ఎస్సై వేధింపులకు పాల్పడుతున్నాడని నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన క్రాంతి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆయన వీడియోలో తెలిపిన వివరాలు.. క్రాంతి తనకు మామ వరుస అయిన ఎస్సై బాబురావుకు రూ.ఏడు లక్షల నగదుతో పాటు 3.5 తులాల బంగారం ఇచ్చాడు. ఆ సొమ్ము ఇవ్వకుండా వేధిస్తున్నట్లు వాపోయాడు. సదరు ఎస్సై బాబురావు సీపీ ఆఫీసులో పని చేస్తున్నట్లు తెలిసింది. బాన్సువాడకు చెందిన క్రాంతి బతుకు దెరువు కోసం కుటుంబంతో నిజామాబాద్‌కు వచ్చారు. బాన్సువాడలో అమ్మిన ఆస్తులకు సంబంధించిన డబ్బులను ఎస్సైకి ఇచ్చామని ఇప్పుడు అవసరం ఉన్నాయని చెప్పినా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కులసంఘంలో మాట్లాడిన సమయంలో అందరి సమక్షంలో దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఎస్సై బాబురావు తనకు, భార్యకు మధ్య విబేధాలు సృష్టించి, భార్యను వారి ఇంటికి తీసుకెళ్లాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తన భార్యతో కొట్టించి, భార్య పిల్లలకు తనను దూరం చేశాడని కన్నీటి పర్యంతమయ్యారు. నగరంలోని రెండో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో తనపై అకారణంగా కేసులు బనాయించి, ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, పోలీసులు రోజు ఇంటికి వస్తున్నట్లు వీడియోలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. క్రాంతి న్యాల్‌కల్‌ రోడ్డులో పురుగుల మందు తాగేటప్పుడు డయల్‌ 100కు ఫోన్‌ చేసి వివరాలను వెల్లడించారు. దీంతో అప్రమత్తమైన డయల్‌ 100 సిబ్బంది నాలుగో టౌన్‌ ఎస్సై సందీప్‌కు సమాచారం అందించారు. ఎస్సై క్రాంతితో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని తెలిపారు. క్రాంతి ఎక్కడ పురుగుల మందు తాగుతున్నాడో లోకేషన్‌ను గుర్తించి వెళ్లారు. పోలీసులు వెళ్లే సరికి క్రాంతి పురుగుల మందు తాగడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం క్రాంతి చికిత్స పొందుతున్నాడు.

కాలువలో పడి మహిళ మృతి



వర్ని: వర్నిలోని నిజాంసాగర్‌ ప్రధాన కాలువలు పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. శనివారం మధ్యాహ్నం కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మహిళ ఎవరు అన్నది ఇంకా తెలియరాలేదు. ఆమె వయసు 40 ఏళ్ల ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. మహిళా ప్రమాదవశాత్తు పడిందా లేదా ఎవరైనా నెట్టివేశారా ఇంకా ఏమైన కారణాలు ఉన్నాయన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి కావడం లేదని ఆత్మహత్య



శివకుమార్‌(ఫైల్‌)

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేటలో ఓ యువకుడు పెళ్లి కావడం లేదని మనస్తాపంతో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన జంగం శివకుమార్‌(35) తనకు పెళ్లి కావడం లేదనే మానసిక క్షోభతో శనివారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై అనిల్‌ చెప్పారు.

చంచల్‌గూడ జైలుకు దాడి కేసు నిందితులు

భిక్కనూరు: భిక్కనూరు మాజీ సర్పంచ్‌ సత్యంరెడ్డిపై దాడి చేసిన పెద్దబచ్చగారి శ్రీధర్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు జ్ఞానప్రకాశ్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్‌ శనివారం తెలిపారు. సత్యంరెడ్డి భార్య శోభాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం రాత్రి నిందితులను అరెస్టు చేశామన్నారు. వారికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండు చేస్తూ నిజామాబాద్‌ జైలుకు తరలించారని ఆదేశించారన్నారు. వారిని జైలుకు తీసుకెళ్లగా అక్కడ శ్రీధర్‌రెడ్డి స్పృహకోల్పోయాడని చెప్పారు. దీంతో పోలీసులు నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించి జైలుకు తీసుకెళ్లామన్నారు. అక్కడ శ్రీధర్‌రెడ్డి, జ్ఞానప్రకాశ్‌రెడ్డి జైలర్‌తో వాదనకు దిగడంతో జైలర్‌ బాన్సువాడ న్యాయమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి సోదరులిద్దరిని బాన్సువాడ న్యాయమూర్తి వద్దకు తరలించారు. న్యాయమూర్తి శనివారం వేకువజామున శ్రీధర్‌రెడ్డి, జ్ఞానప్రకాశ్‌రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.